క్లుప్తంగా

విండ్‌బాల్ ట్రోఫీ విజేత అగనంపూడి లెవెన్స్



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న కోమటి శ్రీనివాసరావు

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు కణితి నిర్వాసితకాలనీ అప్పికొండ సీతారాముల పరస మహోత్సవం సందర్భంగా నిర్వహించిన విండ్‌బాల్ క్రికెట్ పోటీల విజేతగా అగనంపూడి లెవెన్స్ జట్టు నిలిచింది. అప్పికొండ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో రన్నరప్‌గా కేవైఎస్ సూపర్ హీరోస్, తృతీయ స్థానంలో కాశీపాలెం వారియర్స్ నిలిచాయి. వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, రమాదేవి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎన్నేటి రమణ, సారిపిల్లి గణేపతి, దేముడు, పోలవరపు శేఖర్, గోవింద్, వర్రె రాజు, నూకరాజు, రాంబాబు, రంగారావు, అర్జున్, సుమంత్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



ఉక్కునగరంలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

ఉక్కునగరం/అగనంపూడి/పెదగంట్యాడ/అక్కిరెడ్డిపాలెం: టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ రామారావు వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు.

- ఉక్కు శ్రామిక సంఘం ఆధ్వర్యంలో కనీస వేతనాల బోర్డు మాజీ డైరెక్టర్ బొడ్డు పైడిరాజు, కోటేశ్వరరెడ్డి తదితరులు నివాళులర్పించారు.
- జాతీయ రహదారి కూడలి, పెదమడక మినీ జగదాంబ కూడళ్లలో ఎన్టీఆర్ విగ్రహాలకు నాయకులు నెల్లి శ్రీనివాస్, కర్రి దేవేంద్ర, ఇల్లపు ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు.
- 75వ వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, పులి వెంకటరమణారెడ్డి తదితరులు నివాళులర్పించారు.
- 69వ వార్డు వెంకటేశ్వరకాలనీలో జీవన్ బాబు, ఎ.రాజు, తుంగ్లాంలో కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి, భెల్ (హెచ్‌పీవీపీ) టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో కరణం ముత్యాల నాయుడు తదితరులు ఎన్టీఆర్ చిత్రపటాలకు నివాళులర్పించారు.

హోటల్ గదిలో యువకుడి మృతి

శృంగవరపుకోట: హోటల్ గదిలో అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి చెందాడు. విజయనగరం జిల్లా కొత్తవలసకు కూతవేటు దూరంలో ఉన్న ఓ హోటల్‌లో విశాఖ ఎయిర్‌పోర్టు దరి విమాన్‌నగర్‌కు చెందిన యువకుడు శనివారం బసచేశాడు. సాయంత్రం హోటల్ సిబ్బంది గదిలో చూడగా ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సీఐ షణ్ముఖరావు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి జేబులో ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా విమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన జీవన్‌శర్మగా గుర్తించారు. మృతుడి కుటుంబీకులకు సమాచారం అందించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా యువకుడి మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో ఉభయదాతలు పాల్గొన్నారు.

రోడ్లు ధ్వంసం.. ప్రయాణం నరకం



సాయిరామ్ పార్లర్ వెనుక రెండో వీధిలో..

- దెబ్బతిన్న అంతర్గత రహదారులు
- సరిహద్దు కావడంతో పట్టించుకోని వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



వడ్లపూడి చేపల మార్కెట్ నుంచి ఉప్పరకాలనీ వెళ్లే రహదారిలో శిథిలమైన రోడ్డు

దుగ్గపువానిపాలెం మలుపులో..

కాశీపాలెం రోడ్డు దుస్థితి

అగనంపూడి: అసలే ఇరుకురోడ్లు.. ఆపై ధ్వంస రహదారులు... వెరసి జీవీఎంసీ 86,87 వార్డుల సరిహద్దు కాలనీవాసులు అవస్థలకు గురవుతున్నారు. కాశీపాలెం, యాతపాలెం, దుగ్గపువానిపాలెం, ఉప్పరకాలనీ, వారపు సంత వీధి, కూర్మన్నపాలెం స్టాప్, సాయిరామ్‌పార్లర్ వీధులు రెండు వార్డులకు సరిహద్దుగా ఉన్నాయి. దీంతో ఈ రోడ్ల అభివృద్ధిని మహా కార్పొరేటర్లు మధ్యలో వదిలేశారు. దీంతో ఈ ప్రాంతీయులు ఇబ్బందులకు గురవుతున్నారు.

మున్సిపాలిటీ నాటిరోడ్లే దిక్కు

గాజువాక మున్సిపాలిటీ సమయంలో నిర్మించిన రహదారులే సరిహద్దు ప్రాంతాల్లో ఉన్నాయి. చాలా ప్రాంతాల్లో ఆ రోడ్డు దెబ్బతిన్నాయి. కనీసం మరమ్మతులకు నోచుకోకపోవడంతో స్థానికులు రాకపోకలకు పాట్లు పడుతూ ఫీట్లు చేస్తున్నారు.

మారిన రూపు రేఖలు

వీటికి తోడు జీవీఎంసీ మంచినీటి పైప్‌లైన్, యూజీడీ పనులు, ఇతర ప్రైవేటు సెల్ కంపెనీలు వారు కేబుళ్ల అమర్చడానికి తవ్విన గోతులు సక్రమంగా పూడ్చడం లేదు. దీంతో చాలాచోట్ల రోడ్లు రూపురేఖలు మారిపోయాయి. డ్రైనేజీలు కూడా శిథిలం కావడంతో మురుగు నిల్వ ఉండిపోతుంది. ఫలితంగా దోమలు విజృంభిస్తున్నాయి. పందులు, కుక్కలకు స్థావరంగా మారిపోతున్నాయి. కల్వర్టులు శిథిలమై పోయాయి. కల్వర్టుల పైకప్పులు ఎత్తుగా వేయడంతో వాటికి రెండు వైపులా రోడ్డు రూపురేఖలు లేకుండా మారిపోయాయి. కాశీపాలెంలో కల్వర్టుపై నిర్మించిన పైకప్పు అడుగున్నర ఎత్తులో నిర్మించడంతోపాటు పైకప్పు నాశిరకంగా వేయడంతో శిథిలమైంది. మార్కెట్‌లో శివాలయం వద్ద రోడ్డు పూర్తిగా శిథిలమైంది. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో స్థానికులు డెబ్రిస్‌తో పూడ్చారు. బస్టాప్ పక్క రహదారంతా పూర్తిగా ధ్వంసమైంది. వీటికి తోడు ఎక్కడికక్కడ గోతులు తవ్వి పూడ్చకుండా వదిలేశారు. చేపల మార్కెట్ నుంచి ఉప్పరకాలనీకి వెళ్లే రెండు కల్వర్టులకు రెండు వైపులా రోడ్డు గోతులతో నిండిపోయింది. ముస్తాఫా దుకాణం నుంచి యాతపాలెం రహదారి వై జంక్షన్ వద్ద కేబుల్ కోసం తవ్వి ఏళ్ల నుంచి అలాగే వదిలేశారు. ఇటీవల జరిగిన మరమ్మతు పనుల్లో వీటిని పరిగణలోకి తీసుకుంటారని స్థానికులు భావించినా ప్రధాన రహదారులతో సరిపెట్టడంతో ఈ రోడ్డు గతి ఇక మారేలా లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మరీ ఇంత నిర్లక్ష్యమా!



నేను పుట్టకముందు వేసిన రోడ్లు మరమ్మతులకు నోచుకోలేదు. ఏదో ఒక కంపెనీ లేదా జీవీఎంసీ పైప్‌లైన్లు, కేబుళ్ల లైన్ల కోసం తవ్వి వదిలేస్తున్నారు. వీటిని పూడ్చి యథావిధిగా రోడ్డు వేయించే బాధ్యతను జీవీఎంసీ పట్టించుకుపోవడం వల్ల వీధి రోడ్లు అధ్వానంగా మారాయి. రెండు వార్డులకు మధ్యస్తంగా ఉన్న వీధి రోడ్లు అయితే మరీ చిన్నాభిన్నంగా మారాయి. మహా పాలకులు పట్టించుకొని కనీసం మరమ్మతులైనా చేయించాలి.
– పి.చంద్రశేఖర్, యాతపాలెం

అవస్థలు తీరేదెన్నడో?



కొన్నిచోట్ల నడవడానికి కూడా వీల్లేకుండా మారిపోయాయి. రాత్రి వేళల్లో నడిచివెళ్తే గోతుల వద్ద ఫీట్లు చేయాల్సి వస్తుంది. మార్కెట్ రోడ్డు, ఉప్పరకాలనీ, యాతపాలెం, కాశీపాలెంల్లో జీవీఎంసీ అధికారులు దృష్టి సారించి పునర్నిర్మించాలి.
–శంకరరావు, కాశీపాలెం

ఉక్కుకు శాశ్వత పరిష్కారం కావాలి



మాట్లాడుతున్న నీరుకొండ రామచంద్రరావు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు అందించిన నిధులు చెల్లింపులకే సరిపోతాయని.. ఉత్పత్తి పూర్తి స్థాయిలో చేయాలంటే మరో రూ.8వేల కోట్లు అవసరమని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు నీరుకొండ రామచంద్రరావు, వరసాల శ్రీనివాసరావు అన్నారు. ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో 1437వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. ఉక్కుకు ప్యాకేజీ వల్ల తాత్కాలిక ఉపశమనమే తప్పా శాశ్వత పరిష్కారం కాదన్నారు. ఆర్ఎస్ఎల్‌లో విలీనం చేసి సొంత గనులు కేటాయించాలని కోరారు. పునరుద్ధరణ నిధులు విడుదల తెలుగు ప్రజల విజయమన్నారు. ఇచ్చిన నిధుల్లో జీఎస్టీ, బ్యాంక్ చెల్లింపులు, ఓవర్ డ్రాఫ్ట్ పోగా మిగిలేది శూన్యమన్నారు. కార్మికుల వేతన బకాయిలు, పీఎఫ్, ఎల్ఐసీ, డెత్‌ఫండ్ వంటివి వెయ్యి కోట్లకు పైగా ఉందన్నారు. కార్యక్రమంలో పోరాట, పరిరక్షణ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

విశేష పుష్పాలతో సహస్ర నామార్చన



విశేష అలంకరణలో శ్రీవారు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శనివారం తిరుమలేశునికి విశేష పూజలు నిర్వహించారు. వేకువ జామునే విశేష పుష్పాలను సమర్పించారు. రాత్రికి శ్రీదేవి, భూదేవి సహిత తిరుమలేశునికి విశేష పుష్పాలతో సహస్రనామార్చన చేశారు. శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు అందించారు.

వైభవంగా సీతారాముల పరస



మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు కణితి అప్పికొండ నిర్వాసితకాలనీ కాలనీలో శనివారం సీతారాముల పరస మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొని ఆలయంలో విశేష పూజలు చేశారు. ఆవరణలో తప్పెటగుళ్లు, సాముగరిడీలు, తోడుపెద్ద గరిడీలు, చిడతల భజనలు, కోలాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు ఎన్నేటి రమణ, చిత్రాడ రమణ, గణపతి, సత్యవతి, పార్వతి, పెద్ద దేముడు, చిన దేముడు, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతల ప్రచార యావ

భారీ వృక్షం తొలగించి కటౌట్ ఏర్పాటు

అక్కిరెడ్డిపాలెం: రాజ్యం మనదే అన్న చందంగా కూటమి నాయకులు ప్రవర్తిస్తున్నారు. వారి కటౌట్‌లు, ఫ్లెక్సీల ఏర్పాటు చేసుకోవడానికి అడ్డు వచ్చిన చెట్లను సైతం నరికేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నా జీవీఎంసీ అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. జీవీఎంసీ 69వ వార్డు చుక్కవానిపాలెంలో ఒక అపార్ట్‌మెంట్ సమీపంలో కూటమి నాయకుల ఫోటోలతో కూడిన భారీ కటౌట్ ఏర్పాటుకు భారీ వృక్షం అడ్డు రావడంతో చెట్టును నరికేశారు. ఎన్నో సంవత్సరాలుగా ఈ చెట్టు నీడ కలిస్తూ సేదను తీర్చుతుందని స్థానికులు అంటున్నారు. నరికేసిన ఈ చెట్టు కిందే జీవనాధారంగా ఇస్త్రీ చేసుకుని జీవించే దోబీకి కూడా నీడలేకుండా చేశారని వారు వాపోయారు. చెట్టు నరికి కటౌట్ ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.



వృక్షాన్ని నరికి ఏర్పాటు చేసిన భారీ కటౌట్

ఏఎంసీ మహిళా హాస్టల్లో చోరీ

- 4 సెల్‌ఫోన్లు తస్కరించిన యువతి
- ఆమెను పట్టుకుని సెల్‌ఫోన్లు లాక్కున్న విద్యార్థినులు



ఆంధ్రా మెడికల్ కళాశాల మహిళా హాస్టల్

డాబాగార్డెన్స్: ఆంధ్రా మెడికల్ కాలేజీ మహిళా హాస్టల్లో చోరీ జరిగింది. విలువైన నాలుగు సెల్‌ఫోన్లు అపహరణకు గురయ్యాయి. సెల్‌ఫోన్ల చోరీకి పాల్పడ్డ యువతి వైద్య విద్యార్థినిగా హాస్టల్లోకి ప్రవేశించింది. సెల్‌ఫోన్లు తస్కరిస్తున్న వీడియో సీసీ కెమెరాలో రికార్డవుతున్న దృశ్యాన్ని పలువురు వైద్య విద్యార్థినులు పసిగట్టి.. ఆ యువతి నుంచి సెల్‌ఫోన్లు రికవరీ చేశారు. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కింగ్ జార్జి ఆస్పత్రికి అనుబంధంగా ఉన్న ఆంధ్రా మెడికల్ కళాశాల వుమెన్స్ హాస్టల్లోకి రంగిరీజు వీధికి చెందిన ఓ యువతి వైద్య విద్యార్థినిగా లోపలికి చొరబడింది. హాస్టల్లోని పలు గదులను చెక్ చేసుకుంటూ విద్యార్థినులు లేని గదుల్లోకి ప్రవేశించి సెల్‌ఫోన్లు దొంగలించింది. ఆ యువతి సెల్‌ఫోన్లు తస్కరిస్తున్న వీడియో సీసీ కెమెరాలో రికార్డవుతుండడంతో పలువురు వైద్య విద్యార్థినులు పసిగట్టి ఆ యువతిని పట్టుకున్నారు. దొంగలించబడ్డ నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

సెక్యూరిటీ సిబ్బంది ఎక్కడ?

ఆ సమయంలో సెక్యూరిటీ సిబ్బంది ఉన్నట్టా? లేనట్టా? అనేది అనుమానంగా ఉంది. సెల్‌ఫోన్లు దొంగిలించేందుకు హాస్టల్లోకి వెళ్లాలంటే అక్కడ విధులు నిర్వర్తించే ఓ మహిళా సెక్యూరిటీ అనుమతి తప్పనిసరి. అటువంటిది అక్కడ ఉన్న మహిళా సెక్యూరిటీని తప్పుదోవ పట్టించిందో.. లేదా వైద్య విద్యార్థినిగా లోపలికి ప్రవేశించిందో తెలియదు గానీ.. ఆ యువతి హుందాగా వెళ్లి.. సీసీ కెమెరా ద్వారా దొంగగా దొరికిపోయింది.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

డాబాగార్డెన్స్: భద్రాద్రి జిల్లా కొత్తగూడెం ఇల్లందు పటేల్ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన 80వ ఆనంద మేళోత్సవాల్లో ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ పాల్గొన్నారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఎవరు నిష్కామ కర్మతో భగవన్నామ సంకీర్తన చేస్తారో వారికి దైవానుగ్రహంతో పాటు అంతిమంలో మోక్షం కలుగుతుందని తెలిపారు. ప్రేమమూర్తుల కృప భక్తులపైన, మనందరిపైన వర్షించాలన్నారు.

పరిసరాల పరిశుభ్రత.. అందరి బాధ్యత



దేవాడ పీహెచ్‌సీ ఆవరణను శుభ్రం చేస్తున్న సిబ్బంది



కొండయ్యవలసలో పార్కు ఆవరణను శుభ్రం చేస్తున్న నాయకులు



రావులచెరువు వాకింగ్ ట్రాక్‌ను శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ కోటేశ్వరరావు తదితరులు

పెదగంట్యాడ: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని వక్తలు పిలుపునిచ్చారు. పలు ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులు తదితర ప్రాంతాల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.

- జీవీఎంసీ 77వ వార్డు దేవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. ప్రతి రోజూ పరిశుభ్రత కోసం సమయం కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, బంకురు గోపాలం, వెంకటలక్ష్మి, సునీత, కాశీదేవి, దేవి, సత్యవతి, రమ్య, ఉమ, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్

అగనంపూడి: స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమం సందర్భంగా పలు ప్రాంతాల్లో శుభ్రత కార్యక్రమం చేపట్టారు. 86వ వార్డు కూర్మన్నపాలెం రావులచెరువు వాకింగ్ ట్రాక్‌లో చెత్తాచెదారం, ముళ్ల పొదలను తొలగించారు. వాకింగ్ ట్రాక్‌కు రెండువైపులా శుభ్రం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- 85వ వార్డు కొండయ్యవలసలోని సీఎస్ఆర్ పార్కు ఆవరణలో చెత్తా, చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ కవర్లు తొలగించి పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో బి.సత్యనారాయణ, చందు రమేష్, పైడిరత్నం, వి.శ్రీను, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ప్రత్యేక పునరుద్ధరణ ప్యాకేజీకి ఆమోదం తెలిపి ప్రధాని నరేంద్రమోదీ ఊపిరి పోశారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ అన్నారు. ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం, నాయకులు సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

- విశాఖ ఉక్కు పరిరక్షణలో జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాత్ర కీలకపాత్ర పోషించారని ఆ పార్టీ గాజువాక ఇన్‌చార్జి కోన తాతారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ కూర్మన్నపాలెం కూడలిలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రధాని మోదీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. తర్వాత ఉక్కు ఉద్యమ నేత అమృతరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గడసాల అప్పారావు, దల్లి గోవిందరెడ్డి, గవర సోమశేఖర్ పాల్గొన్నారు.

కాలుష్య రహితంగా ఆటోనగర్

ఐలా అధికారులు, పారిశ్రామిక వేత్తల పిలుపు



ఆటోనగర్ బి - బ్లాక్‌లో రోడ్లు ఊడ్చుతున్న ఐలా అధికారులు, పారిశ్రామిక వేత్తలు

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతమైన ఏపీఐఐసీ ఆటోనగర్‌ను కాలుష్య రహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలని ఐలా కమిషనర్ కిషోర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆటోనగర్‌లో ప్రతీ నెలా మూడో శనివారం స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ముందుగా ఆటోనగర్ బి - బ్లాక్ ఐలా కార్యాలయంలో స్వచ్ఛతా కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాజీ ఐలా వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, మాజీ చైర్మన్ వై.సాంబశివరావు స్వచ్ఛతా విధివిధానాలను వివరించారు. అనంతరం బి - బ్లాక్‌లో రోడ్లను ఊడ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలోని పరిశ్రమల యజమానులు తప్పని సరిగా పరిసరాల్లో రోడ్లు, డ్రైన్లు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. వ్యర్థాలను వారి ఫ్యాక్టరీ వద్దకు వచ్చే వాహనానికి అందజేయాలని సూచించారు. వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్ మాట్లాడుతూ ఏపీఐఐసీ ఆటోనగర్‌ను క్లీన్ అండ్ గ్రీన్ ప్రాంతంగా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలుపుదామన్నారు. కార్యక్రమంలో ఐలా ప్రధానకార్యదర్శి చీకటి సత్యనారాయణ, కోశాధికారి పి.పద్మావతి, పీఐడబ్ల్యూఏ అధ్యక్షుడు వి.సత్యనారాయణ, ఎంఎస్ఎంఈ ఏడీ చంద్రమౌళి, పలు బ్లాకుల మెంబర్లు జి.కోటేశ్వరరావు, కర్రి విశ్వనాథం, జి.అశోక్ రాజు, వాసీవా మాజీ ప్రతినిధి కృష్ణ ప్రసాద్, అట్లూరి రమేష్, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం



సెంటర్‌ను ప్రారంభించి నిర్వాహకులతో మాట్లాడుతున్న కమిషనర్ సంపత్‌కుమార్

డాబాగార్డెన్స్: జనక్రాంతి ట్రస్ట్ సహకారంతో డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటువంటి స్వచ్ఛంద సంస్థల నిర్వహణలో నడిచే కేంద్రాల్లో శిక్షణ పొందడం వల్ల నైపుణ్యంతో పాటు పోటీ ప్రపంచానికి కావల్సిన సాంకేతిక పరిజ్ఞానం పరిపూర్ణంగా అందుతుందన్నారు. జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ బి.గంగారావు మాట్లాడుతూ జనక్రాంతి ట్రస్ట్ చైర్మన్ ప్రొఫెసర్ శివప్రసాద్ శిక్షణ తరగతులకు కావల్సిన రూ.10 లక్షల విలువ గల కంప్యూటర్స్‌ను అందజేశారని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్వాహకుడు ఎల్లాజీ మాట్లాడుతూ ఫండమెంటల్స్ ఆఫ్ కంప్యూటర్స్, అకౌంటింగ్, మల్టీ మీడియా వంటి సోషల్ మీడియాకు సంబంధించిన కోర్సులు నామమాత్రపు రుసుంతో రోజుకు 4 షిఫ్టుల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యక్రమ నిర్వహణ బాధ్యులు జీఎస్ రాజేశ్వరరావు, దండు నాగేశ్వరరావు, కామేశ్వరరావు, ఎమ్మారెడ్డి రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.